క్లుప్తంగా

హెచ్ఐవీపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్ ఎర్రన్న

గంట్యాడ: హెచ్ఐవీపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని హెల్త్ ఎడ్యుకేటర్ కె.ఎర్రన్న అన్నారు. మండలంలోని రామవరం గ్రామంలో గురువారం హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ఐవీ రాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండడం ద్వారా హెచ్ఐవీ బారిన పడకుండా ఉండవచ్చని తెలిపారు. హెచ్ఐవీ సోకిన వారు ఏఆర్‌టీ మందులు క్రమం తప్పకుండా తీసుకోవడం ద్వారా జీవిత కాలాన్ని పెంచుకోవచ్చన్నారు. కార్యక్రమంలో అప్పలనాయుడు, మాధవరావు, జ్యోతి, దేవి తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన తప్పనిసరి



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ రమణమూర్తి

గంట్యాడ: అంగన్‌వాడీలు సమయపాలన పాటించాలని ఎంపీడీఓ ఆర్.వి.రమణమూర్తి అన్నారు. మండలంలోని దిగువ కొండపర్తి గ్రామంలో శుక్రవారం గ్రామ సందర్శన కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. అనంతరం స్థానిక పాఠశాలను తనిఖీ చేశారు. పిల్లలకు నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. ఆయన వెంట ఈఓపీఆర్డీ భానోజీరావు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ నానిబాబు, ఏఓ శ్యామ్‌కుమార్, సీడీపీఓ డి.ఉమాభారతి, తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు గరికివలస విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం శ్రీదేవి, పీఈటీ మల్లికార్జునరావు

గుర్ల: రాష్ట్రస్థాయి అండర్-14 బాలికల ఖోఖో పోటీలకు గరికివలస విద్యార్థులు మండల ధనలక్ష్మి, నడుపూరు కుసుమ ఎంపికైనట్లు పీఈటీ మల్లికార్జునరావు గురువారం తెలిపారు. జిల్లాస్థాయిలో నిర్వహించిన పోటీల్లో రాణించడం ద్వారా రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు చెప్పారు. ఈనెల 23 నుంచి 25 వరకు పల్నాడులో జరగనున్న ఖోఖో పోటీల్లో పాల్గొంటారు. ఎంపికైన విద్యార్థులను హెచ్ఎం శ్రీదేవి అభినందించారు.


లక్ష కార్డుల ఉద్యమం విజయవంతం చేయాలి



పోస్టర్లు విడుదల చేస్తున్న అప్పారావు

చీపురుపల్లి: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్రను ఆరో తరగతి నుంచి పీజీ వరకు పాఠ్యాంశాల్లో చేర్చాలని ఉత్తరాంధ్ర దళిత మహాసభ కన్వీనర్ గంటాన అప్పారావు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు చేపట్టిన లక్ష కార్డుల ఉద్యమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. దళిత మహాసభ తలపెట్టిన లక్ష కార్డుల ఉద్యమం పోస్టర్లను గురువారం పట్టణంలో విడుదల చేశారు. ప్రతీ పంచాయతీలో అంబేడ్కర్ స్మృతివనాలు ఏర్పాటు చేయాలని, అమరావతిలో ఉన్న అంబేడ్కర్ స్మృతివనాన్ని ప్రపంచ పర్యాటక కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఏటా ఏప్రిల్ 14న అంబేడ్కర్ జాతీయ అవార్డును ప్రకటించాలన్నారు. ఆయా డిమాండ్ల సాధనకు లక్ష కార్డుల ఉద్యమం చేపడుతున్నట్లు చెప్పారు.

గదబపాలెంలో గ్రామసభ



గిరిజనులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

బొండపల్లి: ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహాఅభియాన్ కింద జిల్లాలో ఎంపిక చేసిన తొమ్మిది గిరిజన గ్రామాల్లో అధికారులు గ్రామసభలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మండలంలోని వెదురువాడ పంచాయతీ గదబపాలెంలో ఎంపీడీఓ జి.గిరిబాల గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఎ.రఘుపతిరావు, పంచాయతీ కార్యదర్శి సాంబమూర్తిరాజు, తదితరులు పాల్గొన్నారు.

బువ్వ పెట్టేదెలా?

- సంక్షేమ హాస్టళ్లపై కూటమి ప్రభుత్వం చిరుకన్ను
- ఐదు నెలలుగా విడుదల చేయని డైట్ చార్జీలు
- అప్పు చేసి భోజనాలు పెడుతున్న వార్డెన్లు
- మండలంలోని రెండు హాస్టళ్లకు సుమారు రూ.6 లక్షల వరకు బకాయి



సాంఘిక సంక్షేమ వసతి గృహంలో భోజనం చేయడానికి ముందు ప్రార్థన చేస్తున్న విద్యార్థులు



సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం

గంట్యాడ: అధికారంలోకి వస్తే వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పిస్తాం. నాణ్యమైన భోజనం అందిస్తామని కూటమి నేతలు గొప్పలు చెప్పారు. అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి ఊసే ఎత్తడం లేదు. వసతి గృహాల్లో చదివే విద్యార్థుల పట్ల కూటమి సర్కార్ నిర్దయతో వ్యవహరిస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వారికి చెల్లించాల్సిన డైట్ చార్జీలు నెలల తరబడి చెల్లించడంలేదు. దీంతో పిల్లలకు భోజనం పెట్టేందుకు వసతి గృహాల వార్డెన్లు నానా అవస్థలు పడుతున్నారు.

గంట్యాడ మండలంలో..

మండలంలో రెండు వసతి గృహాలు ఉన్నాయి. ఒకటి సాంఘిక సంక్షేమ బాలురు వసతి గృహం కాగా, మరొకటి బీసీ సంక్షేమ బాలురు వసతి గృహం. సాంఘిక సంక్షేమ వసతి గృహంలో 61 మంది, బీసీ సంక్షేమ వసృతి గృహంలో 46 మంది విద్యార్థులు చదువుతున్నారు. వారికి ప్రతి రోజు ఉదయం టిఫిన్, రాత్రి భోజనం అందించాల్సి ఉంటుంది. ఆదివారం, ప్రభుత్వ సెలవు దినాల్లో అయితే మూడు పూటలా భోజనం అందించాల్సి ఉంటుంది.

మెనూ వివరాలు

- ఆదివారం ఉదయం పూరి, బంగాళదుంప కుర్మా, ఉడికించిన గుడ్డు, వేరుశెనగ చిక్కి ఇస్తారు. మధ్యాహ్నం చికెన్ బిర్యాని, రైతా, గోంగూరు చట్నీ, సాయంత్రం సేమియా పాయసం, రాత్రికి అన్నం, సాంబరు, క్యారెట్ పెసరపప్పు కూర, మజ్జిగ, అరటి పండు ఇస్తారు.
- సోమవారం ఉదయం చింతపండు పులిహోర, శనగపప్పు పొడి, వేరుశనగ చిక్కి, సాయంత్రం ఉడికించిన బఠాని గుగ్గిళ్లు, రాత్రికి అన్నం, గుడ్డు, టమోటా కూర, మజ్జిగ, జామపండు ఇస్తారు.
- మంగళవారం ఉదయం ఇడ్లీ, వేరుశనగ చట్నీ, వేరుశెనగ చిక్కి, సాయంత్రం రాగి లడ్డు, రాత్రికి తాళింపు అన్నం, చికెన్ కర్రీ, రైతా, గోంగూరు చట్నీ, ఉడికించిన గుడ్డు, అరటిపండు ఇస్తారు.
- బుధవారం ఉదయం జీలకర్ర అన్నం, కూరగాయలతో కూర, వేరుశెనగ చట్నీ, సాయంత్రం ఉడికించిన అలసందు గుగ్గిళ్లు, రాత్రికి అన్నం, గుడ్డు, టమోటో కూర, సాంబరు, మజ్జిగ, జామ పండు ఇస్తారు.
- గురువారం ఉదయం గోధుమ(బన్సీ) రవ్వ ఉప్మా, వేరుశనగ చక్కి, సాయంత్రం కురుకురాలు మిక్చర్, రాత్రికి అన్నం, బెండకాయ ఫ్రై, ఉడికించిన గుడ్డు, సాంబరు, మజ్జిగ, అరటి పండు ఇస్తారు.
- శుక్రవారం ఉదయం పెసరపప్పు, పొంగలి, వేయించిన పచ్చి శనగపలుకుల చట్నీ, వేరుశనగ చిక్కి, సాయంత్రం ఉడికించిన పచ్చి శనగ గుగ్గిళ్లు, రాత్రికి తాలింపు అన్నం, చికెన్ కర్రీ, గోంగూరు చట్నీ, ఉడికించిన గుడ్డు, రైతా, జామపండు ఇవ్వాలి.
- శనివారం ఉదయం ఇడ్లీ, వేరుశనగ చట్నీ, సాయంత్రం రవ్వకేసరి, రాత్రికి అన్నం, దొండకాయ కూర, పాలకూర పప్పు, మజ్జిగ, అరటిపండు ఇవ్వాలి.

ఐదు నెలలుగా అందని డైట్ చార్జీలు

వసతి గృహాల్లో చదివే విద్యార్థులకు రేషన్ బియ్యం మాత్రమే సరఫరా చేస్తారు. కూరలు, గుడ్లు, ఆకుకూరలు, పచ్చిమిర్చి, ఉల్లిపాయలు, అల్లం, పంచదార, గోధుమ నూక, ఇడ్లీ నూక, మినప పప్పు, సేమ్యా, తదితర నిత్యావసర వస్తువులు వార్డెన్లు కొనుగోలు చేసి పెట్టాలి. వార్డెన్లకు డైట్ చార్జీలను ప్రభుత్వం చెల్లిస్తుంది. అయితే నెలకు ఒకసారి ఈ చార్జీలను చెల్లించాల్సి ఉంది. కానీ గత ఐదు నెలలుగా ప్రభుత్వం డైట్ చార్జీలు చెల్లించకపోవడంతో వార్డెన్లు ఇబ్బంది పడుతున్నారు. డైట్ చార్జీలు వచ్చిన వెంటనే డబ్బులు ఇచ్చేస్తామని కిరణా, చికెన్ సెంటర్ల యాజమానులకు వార్డెన్లు చెప్పారు. అయితే నెలల తరబడి చెల్లించకపోవడంతో ఇకపై సరుకులు ఇవ్వలేమని వ్యాపారులు చెప్పడంతో ఏమిచేయాలో తెలియక వార్డెన్లు సతమతమవుతున్నారు. రెండు వసతి గృహాలకు సుమారుగా రూ.6 లక్షల వరకు డైట్ చార్జీల బకాయిలు రావాల్సి ఉంది. దీనిపై ఆయా హాస్టళ్ల వార్డెన్లు గోవింద సన్యాసిరావు, శర్మలను సంప్రదించగా.. ఐదు నెలలుగా డైట్ చార్జీలు చెల్లించలేదు. అయినప్పటికీ విద్యార్థులకు ఇబ్బంది లేకుండా మెనూ ప్రకారం భోజనం పెడుతున్నాం. విద్యార్థుల ఆకలి తీర్చేందుకు అప్పులు చేయాల్సి వస్తోందని వాపోయారు.



బీసీ సంక్షేమ వసతి గృహంలో విద్యార్థులకు భోజనం పెడుతున్న సిబ్బంది



వసతి గృహంలో బయోమెట్రిక్ వేస్తున్న విద్యార్థి

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



జెడ్పీటీసీ శిరీషకు వినతిపత్రం అందజేస్తున్న 104 ఉద్యోగులు

చీపురుపల్లి: ఎంతో కాలంగా ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న 104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. 104 ఉద్యోగుల రాష్ట్ర యూనియన్ పిలుపుమేరకు గురువారం జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీషకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు సక్రమంగా జీతాలు చెల్లించకపోవడంతో కుటుంబ పోషణ భారమవుతోందని వాపోయారు. ప్రభుత్వమే పీహెచ్‌సీల ద్వారా 104 సేవలను నిర్వహించాలని, 2020 తరువాత విధుల్లో చేరిన డ్రైవర్, డీఈఓలకు జీఓ 7 ప్రకారం వేతనాలు చెల్లించాలని, అరబిందో యాజమాన్యం అక్రమంగా వసూలు చేసిన పీఎఫ్ తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. 74 మంది సీనియర్ డ్రైవర్లకు శ్లాబ్ అమలు చెస్తూ డీఎస్సీ ద్వారా నియమితులైన సీనియర్ డ్రైవర్లను కాంట్రాక్టులో పెట్టాలన్నారు. కార్యక్రమంలో 104 ఉద్యోగులు, డ్రైవర్ ఎ.రామరాజు, డీఈఓ హేమలత, కె.అలేఖ్య పాల్గొన్నారు.

వనమిత్ర కేంద్రాల అభివృద్ధికి నిధుల మంజూరు



వనమిత్ర కేంద్రాన్ని పరిశీలిస్తున్న సోషల్ ఫారెస్టు డైరెక్టర్ షణ్ముఖరావు

బొండపల్లి: జిల్లాలోని 36 వనమిత్ర కేంద్రాల అభివృద్ధికి గాను ఉపాధి నిధుల నుంచి రూ.2 కోట్లు మంజూరైనట్టు సోషల్ ఫారెస్ట్ రాష్ట్ర డైరెక్టర్ షణ్ముఖరావు చెప్పారు. మండల కేంద్రంలోని వనమిత్ర కేంద్రాన్ని గురువారం సాయంత్రం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనమిత్ర కేంద్రాల్లోని నర్సరీల్లో వచ్చే ఏడాది నుంచి వేప, కానుగ, మర్రి, మద్ది వంటి మొక్కల పెంపకానికి చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. కేంద్రాల్లో మౌలిక వసతులతో పాటు నర్సీల్లో మొక్కలు పెంపకానికి అవసరమైన పరికరాలు కొనుగోలుకు ఈ నిధులను ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. వనమిత్ర కేంద్రాల్లో ఉన్న సమస్యలను గుర్తించి ప్రతిపాధనలు పంపించాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట డుమా పీడీ కళ్యాణ చక్రవర్తి, డీఎఫ్ఓ ప్రసన్న, ఎంపీడీఓ జి.గిరిబాల, ఏపీఓ బి.కృష్ణవేణి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ జె.చందు, తదితరులు ఉన్నారు.

పండ్ల తోటల సాగుతో ఆదాయం

దత్తిరాజేరు: మారుతున్న కాలానికి అనుగుణంగా ఆదాయం పెరగాలంటే ప్రతీ రైతు పండ్ల తోటలు పెంపకంపై దృష్టి సారించాలని ఉపాధిహామీ రాష్ట్ర డైరెక్టర్ షణ్ముఖరావు అన్నారు. తాడేందొరవలస గ్రామంలో గతంలో ఉపాధిహామీ పథకం ద్వారా ఇచ్చిన సపోటా మొక్కలను గురువారం సాయంత్రం పరిశీలించారు. రైతులతో మాట్లాడి సాగు వివరాలు అడిగి తెలుసుకున్నారు. పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందన్నారు. ఉచితంగా మొక్కలు అందించడంతో పాటు నాలుగేళ్ల పాటు ఎరువులు, సాగు ఖర్చులు కూడా ప్రభుత్వమే అందిస్తుందన్నారు. ఆసక్తి ఉన్న రైతులు పండ్ల తోటల సాగుకు ముందుకురావాలని కోరారు. ఆయన వెంట పీడీ కళ్యాణచక్రవర్తి, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, ఏపీఓ అప్పలనాయుడు, సర్పంచ్ పూడి తిరుపతి ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చీపురుపల్లి: మండలంలో గత్సలవలస సబ్‌స్టేషన్ పరిధిలో వార్షిక మరమ్మతులు కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ పి.త్రినాథరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పత్తికాయవలస, బెవరపేట, బొబ్బాదిపేట, నిమ్మలవలస, దేవర పొదిలం, చొక్కరపాలెం, గుణిద్దాం గ్రామాలలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వెల్లడించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

గుర్లలో..

గుర్ల: మండలంలోని అచ్యుతాపురం విద్యుత్ ఫీడర్ పరిధిలో గోషాడ, గుజ్జింగివలస, కెల్ల చోడవరం, అచ్యుతాపురం, తెట్టంగి, పాలాయవలస, తాతావారి కిట్టాలి, పెనుబర్తి, చింతపల్లిపేట, గంగిరెడ్లపేట గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ రవికుమార్ తెలిపారు.

గజపతినగరంలో..

గజపతినగరం: గర్భాం విద్యుత్ సబ్‌స్టేషన్ వార్షిక నిర్వహణ పనుల కారణంగా గజపతినగరం, దత్తిరాజేరు, బొండపల్లి, మెంటాడ మండలాల్లో శుక్రవారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏడీఈ శివకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

బొండపల్లిలో..

బొండపల్లి: మండల పరిధిలో 11కేవీ విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగిస్తున్నందున శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈఈ ఆర్.శంకరరావు తెలిపారు. రోళ్లవాక, గొట్లాం, అయ్యన్న అగ్రహారం, రెడ్డిపేట, డోలపేట, జియ్యన్నవలస గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

46 మందికి వైద్యసేవలు



వైద్య సేవలందిస్తున్న డాక్టర్ సుష్మ

గజపతినగరం: మండలంలోని బూడిపేట గ్రామంలో గురువారం 104 ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సుష్మ 46 మందికి వైద్య సేవలందించారు. అనంతరం శిబిరానికి రాలేని రోగులకు వారి ఇంటి వద్దకు వెళ్లి వైద్య సేవలందించారు.

76 మందికి కంటి పరీక్షలు

దత్తిరాజేరు: మండలంలోని కోమటిపల్లిలో దీక్ష మహిళా వేల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో ఆప్తాల్మిక్ అసిస్టెంట్ త్రినాథ్ రోగులకు కంటి పరీక్షలు చేశారు. 76 మందికి నేత్ర పరీక్షలు చేయగా వారిలో 14 మందికి శస్త్రచికిత్సకు ఎంపిక చేశారు. వారికి తగరపువలస వద్ద ఉన్న అనిల్ నీరుకొండ ఆస్పత్రిలో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయడంతో పాటు మందులు, కళ్లద్దాలు అందించడం జరుగుతుందన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్

శృంగవరపుకోట: పట్టణంలో దోమల నివారణకు పంచాయతీ ఈఓ అనురాధ, సర్పంచ్ సంతోషి కుమారి ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం ఫాగింగ్ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో పారిశుద్ధ్యం లోపించకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామన్నారు. దోమల నివారణపై దృష్టి సారించినట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు.

హౌస్‌హోల్డ్ సర్వేపై ఆరా..



కంప్యూటర్‌లో సర్వే వివరాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ సూర్యనారాయణ

వేపాడ: మండలంలోని నీలకంఠరాజపురంలో నిర్వహిస్తున్న హౌస్‌హోల్డ్ సర్వేని ఎంపీడీఓ సూర్యనారాయణ గురువారం పరిశీలించారు. గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి సర్వేపై ఆరా తీశారు. సర్వే సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం సచివాలయానికి వెళ్లి కంప్యూటర్‌లో అప్‌లోడ్ చేసిన వివరాలను పరిశీలించారు. త్వరిగతిన సర్వే పూర్తి చేయాలని సూచించారు.

సత్యసాయి జయంతి వేడుకలు రేపు

బొండపల్లి: మండలంలోని కోవ్వాడపేట గ్రామంలో శనివారం సత్యసాయి బాబా 99వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా స్వామి చిత్రపటాన్ని గ్రామ వీధుల్లో ఊరేగించనున్నట్లు తెలిపారు. అనంతరం భారీ అన్నసమారాధన కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీతం ఇంజినీరింగ్ కాలేజీ కరస్పాండెంట్ ఎం.శశిభూషణరావు హాజరు కానున్నారని తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పారిశుద్ధ్య కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, సీఐటీయూ నేతలు

శృంగవరపుకోట: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు కృషిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు ఇవ్వకుండా, సౌకర్యాలు కల్పించకుండా ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మద్దిల రమణ, గాడి అప్పారావు ధ్వజమెత్తారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో పారిశుద్ధ్య కార్మికులతో కలిసి గురువారం ధర్నా చేశారు. కార్మికులకు వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలని, గ్రీన్ అంబాసిడర్లను కేంద్ర ప్రభుత్వమే నిర్వహించాలని, సుప్రీం తీర్పునకు అనుగుణంగా ఇచ్చిన జీఓలు 57, 132, 142, 551, 680లు అమలు చేయాలని, గుర్తింపు కార్డులు, బీమా సౌకర్యం కల్పించాలని, రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, దహన ఖర్చుల కోసం రూ.15 వేలు చెల్లించాలని, టెండర్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీఓకు వినతిపత్రం అందచేశారు.

ధాన్యం కొనుగోలు ప్రక్రియపై శిక్షణ

కొత్తవలస: మండల కేంద్రంలో ఎన్‌జీఓ హోమ్‌లో ధాన్యం కొనుగోలు ప్రక్రియపై గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా సివిల్ సప్లై టెక్నికల్ సహాయకులు ధాన్యం కొనుగోల సమయంలో పాటించాల్సిన నిబంధనలపై మండల వ్యవసాయ అధికారులు, విలేజ్ అగ్రికల్చర్ సహాయకులు, కొనుగోలు సహాయక సిబ్బందికి అవగాహన కల్పించారు. ధాన్యం నాణ్యత, తేమ, తూకం, నెట్టివేయడం, ట్రక్ సీట్లు రాయడం, తదితర అంశాలను వివరించారు. అలాగే సాధారణ రకం 40 కేజీలు రూ.920, ఏ గ్రేడ్ 40 కేజీలు రూ.928లు మద్దతు ధరగా ప్రభుత్వం నిర్ణయించినట్లు చెప్పారు. కార్యక్రమంలో కొత్తవలస మండల సీఎస్‌డీటీ రామకృష్ణ, కొత్తవలస, జామి, ఎల్.కోట మండలాల వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలు మరింత బలోపేతం కావాలి



మహిళా సంఘాల రికార్డులను పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ ఏడీ సావిత్రి

కొత్తవలస: మహిళా సంఘాలకు ప్రభుత్వం అందజేస్తున్న రాయితీ రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలోపేతం కావాలని డీఆర్‌డీఏ-వెలుగు అదనపు సంచాలకులు కె.సావిత్రి సూచించారు. మండలంలోని కంటకాపల్లి గ్రామంలో మహిళా సంఘాలు ఏర్పడి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సంఘాల రికార్డులను గురువారం ఆమె తనిఖీ చేశారు. సంబంధిత సంఘాలకు మంజూరైన స్త్రీనిధి, బ్యాంకు రుణాల వివరాలను పరిశీలించారు. సంఘ సభ్యులు ప్రతీ నెల సమావేశమై సంఘం నిర్వహణపై చర్చించుకోవాలని, ప్రతీ ఏటా గ్రూపు అధ్యక్ష, కార్యదర్శులను మార్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఎం ఫైనాన్స్ జె.లక్ష్మణనాయుడు, స్త్రీనిధి ఏజీఎం ఉమామహేశ్వరరావు, ఏపీఎంలు విజయలక్ష్మి, ఎ.వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

రూ.1.30 కోట్లతో 81 పనులు



సామాజిక తనిఖీ వివరాలు వెల్లడిస్తున్న డీఆర్పీ నరసింగరావు

మెరకముడిదాం: మండలంలోని భైరిపురంలో రూ.1.30 కోట్లతో చేపట్టిన ఉపాధిహామీ పనులకు సంబంధించిన సమాజిక తనిఖీలపై గురువారం గ్రామసభ నిర్వహించారు. డీఆర్పీ నరసింగరావు సమాజిక తనిఖీల వివరాలను వెల్లడించారు. గ్రామంలో రూ.1.30 కోట్లతో 81 పనులు చేపట్టినట్లు తెలిపారు. ఆయా పనుల వివరాలను క్షుణ్ణంగా తనిఖీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ పప్పల కృష్ణమూర్తి, మాజీ సర్పంచ్ కెంగువ ధనుంజయ, క్షేత్రసహాయకుడు శ్రీనివాసరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైభవంగా గౌరమ్మ నిమజ్జనోత్సవం



పూజలందుకుంటున్న గౌరీపరమేశ్వరులు

వేపాడ: వేపాడ, వల్లంపూడి గ్రామస్తుల ఆరాధ్య దైవం గౌరీపరమేశ్వర్లు(గౌరమ్మ) నిమజ్జనోత్సవం బుధవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. గౌరమ్మను ఒక ఏడాది వల్లంపూడిలో, మరో ఏడాది వేపాడలో కొలువుదీర్చి పూజలు చేయడం పూర్వికుల నుంచి వస్తున్న సంప్రదాయంగా గ్రామస్తులు తెలిపారు. ఈ ఏడాది వల్లంపూడిలో ఆశ్వీయజ మాసం శుక్లపక్ష పాడ్యమి నాడు గౌరమ్మను కొలువుదీర్చి కార్తీకమాసం పౌర్ణమి వరకు నిత్యపూజలు చేశారు. బుధవారం రాత్రి రెండు గ్రామాల్లో గౌరీపరమేశ్వరులను మేళతాళాలు, సంప్రదాయ నృత్యాలతో ఊరేగించారు. ఈ సందర్భంగా రైవాడ, భర్తవానిపాలెం మహిళా కళాకారుల కోలాటం ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం దబ్బిరాజు చెరువులో గౌరీపరమేశ్వరుల ప్రతిమలను నిమజ్జనం చేశారు.

బీమా చెక్కు అందజేత



బీమా పరిహారం చెక్కును అందజేస్తున్న బ్యాంకు మేనేజర్ సునీత, తదివతరులు

వేపాడ: మండలంలో బల్లంకి గ్రామానికి చెందిన పల్ల లక్ష్మి(47) అనారోగ్యంతో ఇటీవల మృతిచెందారు. మృతురాలు గతంలో గ్రామానికి చెందిన బ్యాంకు మిత్ర వద్ద ప్రీమియం చెల్లించి బీమా తీసుకోవడంతో పరిహారం మంజూరైంది. వేపాడ గ్రామీణ బ్యాంకు మేనేజర్ సునీత గురువారం మృతురాలి భర్త సత్తిబాబుకు పరిహారం చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ అరుణకుమార్, క్యాషియర్ రామారావు, చంద్రబాబునాయుడు, బ్యాంకు మిత్ర ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

జియో ట్యాగింగ్ వేగవంతం చేయాలి

- డీఎల్‌పీఓ మోహనరావు



వీలుపర్తిలో సర్వే వివరాలను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ మోహనరావు, తదితరులు

వేపాడ: స్వర్ణ పంచాయతీల్లో భాగంగా నిర్వహిస్తున్న జియో ట్యాగింగ్ సర్వే వేగవంతం చేయాలని డీఎల్‌పీఓ మోహనరావు సూచించారు. వేపాడ, వీలుపర్తి గ్రామ సచివాలయాలను ఎంపీడీఓ సూర్యనారాయణతో కలిసి గురువారం సందర్శించారు. గ్రామాల్లో గృహాలకు జియో ట్యాగింగ్‌తో పాటు బ్యాంకు ఖాతాలకు ఎన్‌పీసీఐ అనుసంధానంపై ఆరా తీశారు. జిల్లాలో వేపాడ మండలంలో వెనుకబడి ఉందని, త్వరితగతిన సర్వే పూర్తిచేయాలని సూచించారు. మండలంలో 11,300 గృహాలకు సంబంధించి సర్వే నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.